RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 67 | మార్చి 27 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 67 | March 27 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


దావోస్ పర్యటనపై విమర్శలు.. తిప్పికొట్టిన మంత్రి శ్రీధర్ బాబు 2

# నేడు ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ కీలక భేటీ

**పశ్చిమాసియా సంక్షోభంపై సమావేశం**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ** : పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయంగా మారుతున్న సమీకరణాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై పడకుండా ఉండేందుకు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం 6:30 గంటలకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న వ్యూహాలను ప్రధాని వివరించనున్నారు. ముఖ్యంగా యుద్ధం కారణంగా తలెత్తే సవాళ్లను ఎదుర్కోవడంలో రాష్ట్రాల సన్నద్ధత, కేంద్రానికి అందించాల్సిన సహకారంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. అయితే, వచ్చే నెలలో అసెంబ్లీ

➤ మిగతా 2వ పేజిలో..

## మార్కాపురం బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా

**న్యూఢిల్లీ/మార్కాపురం:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రైవేట్ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటనలో ప్రయాణికులు సజీవ దహనం కావడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో

➤ మిగతా 2వ పేజిలో..

## అబుదాబిపై ఇరాన్ మిస్సైల్ దాడి

### భారతీయ వ్యక్తి సహా ఇద్దరు మృతి



**టెహ్రాన్/అబుదాబి జనసంఘర్షణ** : ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న పోరు 27వ రోజుకు చేరుకుంది. ఈ ఉద్రిక్తతలు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా పొరుగున ఉన్న అరబ్ దేశాలకు కూడా విస్తరిస్తున్నాయి. గురువారం అబుదాబిని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ మిస్సైల్‌ను యూఏఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ గాల్లోనే అడ్డుకుంది. అయితే, ఈ ప్రక్రియలో మిస్సైల్ శకలాలు కింద పడటంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో ఒకరు భారతీయుడు కాగా, మరొకరు పాకిస్థాన్ పౌరుడిగా అబుదాబి మీడియా ఆఫీస్ ధృవీకరించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ సంక్షోభం కారణంగా ఇప్పటివరకు మరణించిన భారతీయుల సంఖ్య ఏడుకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. యూఏఈ రక్షణ వ్యవస్థలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ ఇప్పటివరకు ఇరాన్ ప్రయోగించిన సుమారు 372 బాలిస్టిక్ మిస్సైళ్లు, 15 క్రూయిజ్ మిస్సైళ్లు మరియు 1,826 డ్రోన్లను

➤ మిగతా 2వ పేజిలో..

# మార్కాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**టిప్పర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు.. 13 మంది సజీవ దహనం**



**మార్కాపురం జనసంఘర్షణ**

ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో గురువారం తెల్లవారుజామున ఒక భీకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాయవరం పరిసరాల్లోని పలకల క్వారీల వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే బస్సు, టిప్పర్ రెండింటిలోనూ ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెను విషాదం నెలకొంది. బస్సులో నిద్రిస్తున్న ప్రయాణికులు తేరుకునే లోపే మంటలు వ్యాపించడంతో, దాదాపు 13 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ ఘటనలో మరో 28 మందికి తీవ్ర గాయాలవ్వగా, వారిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదం తెల్లవారుజామున 6 గంటల సమయంలో జరగడంతో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. బస్సు ముందు భాగం టిప్పర్‌ను

➤ మిగతా 2వ పేజిలో..

## ఆరోగ్యశ్రీ బకాయిలు మేమే కడుతున్నాం

**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం**



**హైదరాబాద్ జనసంఘర్షణ** : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి భారీగా బకాయిలు పెట్టి వెళ్లినా, తమ ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిధులు విడుదల చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. గురువారం శాసనసభలో మాట్లాడిన ఆయన, గత ప్రభుత్వం సుమారు రూ. 600 కోట్ల బకాయిలను వదిలేసిందని, అయితే తాము అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ. 2,408 కోట్ల బిల్లులను చెల్లించామని వెల్లడించారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ. 1,480 కోట్లు

➤ మిగతా 2వ పేజిలో..

## భద్రాచలం అభివృద్ధికి రూ.586 కోట్లు

**నేడు రాముయ్య కల్యాణానికి సీఎం రేవంత్ రెడ్డి రాక**



**భద్రాచలం జనసంఘర్షణ** : దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం పుణ్యక్షేత్రం రూపురేఖలను మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంతో పాటు భద్రాచలం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు

➤ మిగతా 2వ పేజిలో..

## ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక

**"సమయం మించిపోకముందే ఒప్పందానికి రండి"**



**వాషింగ్టన్ జనసంఘర్షణ** : పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, ఇరాన్ తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నిప్పులు చెరిగారు. ఇరాన్ తన మొండి వైఖరిని వీడి, తక్షణమే చర్చల ద్వారా ఒప్పందానికి రావాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆలస్యం చేసే కొద్దీ పరిస్థితులు చేయి దాటిపోతాయని, ఆ తర్వాత వెనక్కి

➤ మిగతా 2వ పేజిలో..

## మిషన్ భగీరథపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

**అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు భట్టి విక్రమార్క సవాల్**

**హైదరాబాద్ జనసంఘర్షణ** : తెలంగాణ అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. బీఆర్ఎస్ సభ్యులు ప్రజా సమస్యలను పక్కనపెట్టి, గత పదేళ్ల కేసీఆర్ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. ముఖ్యంగా మిషన్ భగీరథ పథకం తీరుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాదాపు రూ. 40 వేల కోట్లు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేసినా, క్షేత్రస్థాయిలో ప్రజలకు తాగునీరు అందడం లేదని ఆయన ఆరోపించారు. "మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చారా? లేక పైపుల కంపెనీల ప్రయోజనం కోసం

➤ మిగతా 2వ పేజిలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
27 శుక్రవారం, మార్చి 2026

## మార్కాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** ఢీకొనడంతో మంటలు వేగంగా విస్తరించాయి. బస్సు వెనుక భాగంలో ఉన్న ప్రయాణికులు బయటకు వచ్చే మార్గం లేక మంటల్లో చిక్కుకుపోయి మరణించగా, ముందు వరుసల్లో ఉన్న కొందరు ప్రాణాలతో బయటపడగలిగారు. ఈ బస్సు తెలంగాణలోని నిర్మల్, జగిత్యాల ప్రాంతాల నుండి బయలుదేరి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. మృతుల్లో వింజమూరు, కనిగిరి, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా ఉన్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి మృతదేహాలను వెలికితీశారు. క్షతగాత్రులను వెంటనే మార్కాపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

ప్రమాద సమాచారం అందిన వెంటనే మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఘటనాస్థలిని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతులను మనోజ్‌కుమార్, సుజాత, మేఘన, నరేంద్ర, చందన, చందు, ప్రకాశ్, అయ్యన్న, గురవయ్య, అబ్రహం, మహేంద్రరెడ్డి, ప్రవీణ్, సౌజన్యలుగా గుర్తించారు. ఈ ఘోర ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

## అబుదాబిపై ఇరాన్ మిస్సైల్ దాడి

**మొదటిపేజీ తరువాయి..** అడ్డుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, ఈ దాడుల వల్ల సామాన్య ప్రజలు బలైపోతుండటం అంతర్జాతీయ సమాజంలో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఉద్రిక్తతలపై స్పందిస్తూ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ మిలిటరీ శక్తి గణనీయంగా దెబ్బతిన్నదని, వారు ఒకవైపు అమెరికాతో ఒప్పందం కోసం వేడుకుంటూనే బయటకు మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. సమయం మించిపోకముందే ఒక నిర్ణయానికి రాకపోతే, ముందుముందు పరిస్థితులు మరింత తీవ్రంగా ఉంటాయని, అప్పుడు వెనక్కి తిరిగి చూసే అవకాశం ఉండదని ట్రంప్ హెచ్చరించారు. అబుదాబిపై జరిగిన ఈ తాజా దాడితో గల్ఫ్ దేశాల్లో భయాందోళనలు మరింత పెరిగాయి.

## ఆరోగ్యశ్రీ బకాయిలు మేమే కడుతున్నాం

**మొదటిపేజీ తరువాయి..** అందజేశామని వివరించారు. గతంలో నెలకు సగటున రూ. 52 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ. 89 కోట్లు ఖర్చు చేస్తోందని గణాంకాలతో సహా వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి దుర్వినియోగంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు పీఏలు, కీలక వ్యక్తులు సీఎంఆర్ఎఫ్ నిధులను సొంత ఖాతాల్లోకి మళ్లించారని, ఈ బాగోతాలన్నింటిపై విచారణ జరుగుతోందని హెచ్చరించారు. త్వరలోనే ఈ అక్రమాలన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. తమ 27 నెలల పాలనలో పేదల వైద్యం కోసం మొత్తం రూ. 4,500 కోట్లు వెచ్చించామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. విద్యా, వైద్య రంగాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నిధుల కోత ఉండదని, అవసరమైతే ఇతర విభాగాల్లో సర్దుబాటు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యమని చెబుతూ, టీచింగ్ ఆసుపత్రుల నిర్వహణను ఇకపై గ్రూప్-1 అధికారులకు అప్పగించనున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రతి కుటుంబానికి ధీమా కల్పించేలా కొత్త జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నామని, విదేశాల్లో ఉన్న నిపుణులైన వైద్యుల సేవలను కూడా వినియోగించుకుంటామని తెలిపారు. గోషామహల్‌లో 30 ఎకరాల విస్తీర్ణంలో రూ. 3,000 కోట్లతో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య రంగాన్ని పటిష్టం చేసి తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## నేడు శ్రీరామనవడి వేడుక

### నగరంలో శోభాయాత్రకు భారీగా ఏర్పాట్లు

### యాత్ర మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, :** శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా హైదరాబాద్ నగరంలో శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. సీతారాంబాగ్ దేవాలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర జరగనుంది. ఈ మార్గంలో వాహనాలకు అనుమతి ఉండదు. శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించనున్నారు. సీతారాంబాగ్, బోయిగూడ కమాన్ నుంచి మల్లేపల్లి ఎక్స్ రోడ్స్ వైపు ట్రాఫిక్ మళ్లించనున్నారు. మంగళ్‌హాట్, గాంధీ విగ్రహం, పురానాపూల్, జుమేరాత్ బజార్ నుంచి వచ్చే వాహనాలను టక్కర్‌వాడీ జంక్షన్ వైపు డైవర్ట్ చేయనున్నారు. ఎంజే బ్రిడ్జ్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, సిటీ కాలేజీ వైపు వెళ్లే వాహనాలను జుమేరాత్ బజార్ మీదుగా మళ్లించనున్నారు. అబిడ్స్ జీపీఓ, సుల్తాన్ బజార్, కోఠి, అబిడ్స్ ప్రధాన రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను నిలిపివేయనున్నారు. బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ రద్దీగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు హైదరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు.

## నేడు ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ కీలక భేటీ

**మొదటిపేజీ తరువాయి..** ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు సమాచారం. ఆయా రాష్ట్రాల తరపున ప్రధాన కార్యదర్శులు ఈ చర్చల్లో పాల్గొంటారు. ఇటీవల పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని మోదీ.. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఈ సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని, ఇది దేశానికి ఒక పరీక్షా సమయమని పేర్కొన్నారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు అన్ని రాష్ట్రాలు కేంద్రంతో కలిసి 'టీమ్ ఇండియా'లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చమురు, గ్యాస్ కొరతపై రకరకాల వదంతులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో, మధ్యప్రాచ్య యుద్ధం వల్ల తలెత్తే ఇబ్బందులను ఎలా అధిగమించాలన్న దానిపై మోదీ రాష్ట్రాలకు దిశానిర్దేశం చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించడంతో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఇరాన్ ప్రతికార దాడులకు దిగి హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడింది. భారత్‌లో కూడా మళ్ళీ లాక్‌డౌన్ తరహా పరిస్థితులు వస్తాయన్న పుకార్లు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నిర్వహించబోయే ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రజలు ఆందోళన చెందకుండా వాస్తవ పరిస్థితులను వివరించాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రధాని ఈ భేటీ ద్వారా స్పష్టం చేయనున్నారు.

## ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి..** తగ్గడం తన వల్ల కాదని ఆయన స్పష్టం చేశారు. తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా స్పందించిన ట్రంప్, ఇరాన్ మిలిటరీ శక్తి ఇప్పటికే పూర్తిగా క్షీణించిందని, తిరిగి కోలుకునే అవకాశం లేదని విమర్శించారు. ఒకవైపు తమతో ఒప్పందం కోసం ఇరాన్ లోపాయికారీగా ప్రయత్నిస్తూనే, బయటకు మాత్రం భిన్నమైన ప్రకటనలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఇరాన్ ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తోందని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతూనే మరోవైపు పశ్చిమాసియా దేశాలపై దాడులకు పాల్పడటం సరికాదని ట్రంప్ హితవు పలికారు. "వారు చాలా పెద్ద తప్పు చేస్తున్నారు. సమయం మించిపోకముందే ఒక నిర్ణయానికి రావడం వారికి మంచిది. ఒకసారి పరిస్థితి విషమిస్తే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు" అని ఆయన కుండబద్దలు కొట్టారు. అయితే, అమెరికా చేస్తున్న ఈ హెచ్చరికలపై ఇరాన్ విదేశాంగ శాఖ భిన్నంగా స్పందిస్తోంది. ప్రస్తుతం తాము అమెరికా ప్రతిపాదనలను కేవలం పరిశీలిస్తున్నామని, యుద్ధాన్ని ముగించేందుకు తక్షణ చర్చలు జరిపే ఉద్దేశం తమకు లేదని పేర్కొనడం గమనార్హం. గల్ఫ్ దేశాలలో చమురు క్షేత్రాలపై దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో, ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి.

## మిషన్ భగీరథపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

**మొదటిపేజీ తరువాయి..** తెచ్చారా?" అని భట్టి విక్రమార్క నిలదీశారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ ఈ పథకం సక్రమంగా పనిచేయడం లేదని, ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, మరమ్మతులతోనే కాలం గడుస్తోందని విమర్శించారు. ఈ పథకం పనితీరుపై నిజానిజాలు తేల్చేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేద్దామని, ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా పరిశీలిద్దామని ఆయన సవాల్ విసిరారు. కొత్త పథకం పేరుతో పాత నీటి వనరులను నిర్లక్ష్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతకుముందు, ఎమ్మెల్యే సునీత చేసిన 'కల్యాణ లక్ష్మి' చెక్కుల జాప్యంపై భట్టి స్పందిస్తూ.. ఒకవేళ పెళ్లయి బిడ్డ పుట్టినా చెక్కు అందలేదన్నది వాస్తవమైతే, దానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా విచారిస్తుందని హామీ ఇచ్చారు. అయితే సాధారణంగా ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి జాప్యం జరగడం లేదని, స్థానిక ఎమ్మెల్యేల సంతకాలు లేదా దరఖాస్తుల్లో లోపాల వల్లే ఇలాంటివి జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష సభ్యులు సభలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ముఖ్యమంత్రి మరియు మంత్రులను గౌరవిస్తూ సభా మర్యాదలను పాటించాలని ఆయన హితవు పలికారు.

## నిలకడగా సోనియా ఆరోగ్యం

### గంగారాం ఆస్పత్రి వైద్యుల వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి26** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి 24వ తేదీ రాత్రి జ్వరం కారణంగా ఆమె న్యూఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరారు. ప్రత్యేక వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోనియా ఆరోగ్యానికి సంబంధించి గంగారాం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ విజయ్ స్వరూప్ గురువారం హెల్త్ బులిటిన్ విడుదల చేశారు. సోనియా ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. చికిత్సకు సోనియా ఆరోగ్యం సహకరిస్తోందని వెల్లడించారు.

## మార్కాపురం బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

**మొదటిపేజీ తరువాయి..** మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ప్రధాని కార్యాలయం (పీఎంఓ) ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించింది. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సాయాన్ని ప్రధాని ప్రకటించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆయన ప్రార్థించారు.

రాయవరం సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక యంత్రాంగం, సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను ఆదుకున్నాయి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారులను ఆదేశించింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి బాధితుల పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

## భద్రాచలం అభివృద్ధికి రూ.586 కోట్లు

**మొదటిపేజీ తరువాయి..** మొత్తం రూ.586 కోట్ల నిధులను కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇందులో భాగంగా మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని ఆయన తెలిపారు.

శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలోని మిథిలా కల్యాణ మండపంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీతారామచంద్రస్వామి దంపతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించనున్నారని పేర్కొన్నారు. భద్రాచలం అభివృద్ధిని మూడు దశల్లో పూర్తి చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందించామని, భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీతో పాటు ఎయిర్‌పోర్టు ఏర్పాటు దిశగా కూడా అడుగులు వేస్తున్నామని వివరించారు.

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించామని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ వంటి అన్ని సౌకర్యాలను దేవాలయ అధికారులు సిద్ధం చేశారని, భక్తులందరూ ప్రశాంతంగా రామయ్య కల్యాణాన్ని వీక్షించాలని మంత్రి కోరారు.

## దావోస్ పర్యటనలో రూ.2.19 లక్షల కోట్లు పెట్టుబడులు

### విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మార్చి26 :** దావోస్ పెట్టుబడులు, ఎంవోయూలపై శాసనసభలో విపక్ష సభ్యులు చేసిన విమర్శలను మంత్రి శ్రీధర్‌బాబు తిప్పికొట్టారు. దావోస్ పర్యటనల్లో తెలంగాణకు రూ.2.19 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పెట్టుబడిదారులతో ప్రభుత్వం 44 ఎంవోయూలు కుదుర్చుకుందని వెల్లడించారు.ఈ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. దావోస్ పర్యటనల్లో 44 ఎంవోయూలు ప్రభుత్వం కుదుర్చుకుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. అసెంబ్లీలో దావోస్ పెట్టుబడులపై శ్రీధర్ బాబు మాట్లాడారు. పెట్టుబడులతో 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయని, 2024 దావోస్ లో 18 ఎంవొయూలు.. రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో 6 కంపెనీలకు భూముల కేటాయింపు జరిగిందని, భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం కేటాయించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మరో 3 కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూముల గుర్తింపు చర్యలు చేశామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో 11 కంపెనీలు కార్యకలాపాలు జరిగాయని అన్నారు. నిజామాబాద్ లో 681 సీట్ల సామర్థ్యంతో ఐటి టవర్ నిర్మించామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగాలు పనిచేస్తున్నారని అన్నారు. పెట్టుబడుల ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు, ఉపాధి లభిస్తుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర 7వ మహాసభలు విజయవంతం చేయాలి

- హైదరాబాద్‌లో ఏప్రిల్ 10-11 తేదీలలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర 7వ మహాసభలు విజయవంతం చేయాలని పిలుపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ప్రతినిధి:( జన సంఘర్షణ )

కాచానపల్లి : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను హైదరాబాద్‌లో ఏప్రిల్ 10, 11 తేదీలలో నిర్వహించనున్నట్లు పేర్కొంటూ గుండాల మండలం కాచానపల్లి గ్రామంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం కామ్రేడ్ పూనెం సత్యం అధ్యక్షతన నిర్వహించగా, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యనగంటి చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోపిడీ రాజ్యానికి వ్యతిరేకంగా గళమెత్తిన శ్రామిక వర్గాల స్వరంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆవిర్భవించిందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గర్జించిన బండి యాదగిరి వంటి మహనీయుల వారసత్వాన్ని కొనసాగిస్తూ, శ్రీకాకుళం ఉద్యమం స్ఫూర్తితో 1974లో అరుణోదయ స్థాపించబడిందన్నారు. 52 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో దోపిడీ, పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా డప్పుల దరువులతో, జానపద కళారూపాలతో ప్రజల్లో చైతన్యం కలిగించిందని చెప్పారు. ఒగ్గు కథ, బుర్రకథ, హరికథ, జానపద నృత్యాలు వంటి అనేక కళారూపాల ద్వారా గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసిందన్నారు. తెలంగాణలో సారా, కరువు, డ్రగ్స్, గంజాయి, వరకట్నం, మూఢనమ్మకాల వంటి సామాజిక సమస్యలపై పాటల ద్వారా ఉద్యమాలు చేపట్టి ప్రజలను చైతన్యం చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా పాటలతో ప్రజలను ఉద్యమ మార్గంలో నడిపించిందని తెలిపారు. గిరిజన, దళిత, ముస్లిం మైనారిటీలు, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం అరుణోదయ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ క్రమంలో అనేక మంది కళాకారులు తమ ప్రాణాలు అర్పించారని, కానూరి వెంకటేశ్వర్లు, రామారావు, పల్స బిక్షం, ఏనుగుల వెంకన్న, కోడి శ్రీరాములు, సుబ్బారావు వంటి అమర కళాకారులను స్మరించుకున్నారు. గతాన్ని సమీక్షించుకొని, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు ఈ రాష్ట్ర మహాసభలు కీలకమని పేర్కొంటూ, అన్ని వర్గాల ప్రజలు ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటికం శేఖర్, మల్లయ్య, ఎల్లయ్య, సంపత్, బొమ్మర్ల వీరన్న, లాజర్ తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి

- పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఆర్ గౌతమ్ కుమార్ డిమాండ్

బోధన్ : మార్చి 26 జన సంఘర్షణ

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు బోధన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బోధన్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల బందును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆర్.గౌతమ్ కుమార్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 వార్షిక సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం మనందరికీ తెలిసిందే దీనిలో విద్యారంగానికి చాలా తక్కువ శాతం నిధులు కేటాయించడం జరిగింది. విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాస్వామిక వాదులు బడ్జెట్లో విద్యకు కనీసం 20 శాతం నిధులు అయిన కేటాయించాలని తమ అభిప్రాయాలు తెలియజేసినప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా 8% శాతం నిధులు మాత్రమే కేటాయించడం విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేయడమే. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న 8500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విషయం మాట్లాడకుండా బకాయిలను పూర్తిగా విడుదల చేయకపోవడం ద్వారా మళ్లీ విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు రియంబర్స్మెంట్ గత నాలుగు సంవత్సరాలుగా రాకపోవడం వలన విద్యా సంవత్సరం పూర్తయిన విద్యార్థులు తమ యొక్క సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మొత్తం ఫీజు చెల్లిస్తేనే మీయొక్క సర్టిఫికెట్లు ఇస్తామని చెప్తున్నా కనీసం ప్రభుత్వాలు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం సరైనది కాదని విద్యార్థుల సమస్యను గుర్తించి పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్స్ బాకాయలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో పిడిఎస్ రాష్ట్ర నాయకులు ఎన్ కార్తీక్ జిల్లా కోశాధికారి కే సాయినాథ్, బలరాం, వికాస్, చక్రధర్, రవి తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా పాలనాధికారి ఆశీష్ సాంగ్వాన్ అధ్యక్షతన డీసీసీ /డీఎల్ఆర్‌సీ సమావేశం..

మార్చ్26 (జన సంఘర్షణ)

గురువారం మినీ సమావేశం మందిరంలో జిల్లాలో బ్యాంకింగ్ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు డిసెంబర్ 2025 త్రైమాసికానికి సంబంధించిన సమావేశం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.
సభలో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అమలు పరిస్థితిని సమీక్షించారు. 30.12.2025న జరిగిన గత సమావేశంలో ఆమోదించబడ్డ వాటిపై తీసుకున్న చర్యల నివేదికను పరిశీలించి, అనేక రంగాలలో పురోగతి నమోదైనట్లు గుర్తించారు.
వ్యవసాయ రంగంలో పంట రుణాలు, టర్మ్ రుణాలు, మౌలిక సదుపాయాల రుణాల మంజూరు, పునరుద్ధరణను వేగవంతం చేయాలని బ్యాంకులకు సూచించారు. ఎంఎస్ఎంఈ రంగంలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంతో రుణ మంజూరులో మెరుగుదల, స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) బ్యాంక్ అనుసంధానం కింద ఎంసీపీల అమలు పురోగతి ఎస్‌హెచ్‌జీ రుణాల కింద ఉన్న ఎన్‌పీఏఈ ఖాతాల రికవరీ కోసం సంయుక్త చర్యలు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల పథకాల కింద యూనిట్ల స్థాపనలో కొంత పురోగతి పెండింగ్‌లో ఉన్న వాటి లక్ష్యాలను చేరుకోవాలని మత్స్య, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన ఖజజ రుణ దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించాలని సూచించారు. డీసీసీ,డీఎల్ఆర్‌సీ సమావేశాలకు బ్యాంక్ కంట్రోలర్ల హాజరు తప్పనిసరి అని స్పష్టం చేశారు.

**సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు:**

వార్షిక రుణ ప్రణాళిక 2025-26 లక్ష్యాలను చేరుకునేందుకు బ్యాంకులు మరింత కృషి చేయాలని, ప్రాధాన్యతా రంగాలకు రుణ ప్రవాహాన్ని పెంచాలని, పెండింగ్ దరఖాస్తులు, ఖ్రీూా ఖాతాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని బ్యాంకులు తమ డేటాను సకాలంలో సమర్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు బ్యాంకులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఆర్థికాభివృద్ధిని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, బ్రాంచ్ మేనేజర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# కోనాపూర్ గ్రామం నుంచి బిజెపి బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి చేరిక..

(జన సంఘర్షణ) కామారెడ్డి ప్రతినిధి మార్చ్ 26:

కామారెడ్డి నియోజకవర్గ జిల్లా కేంద్రంలోని బిబిపేట మండలం కొనాపూర్ గ్రామానికి చెందిన బిజెపి, బిఆర్ఎస్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి, బిఆర్ఎస్ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై బిజెపి, బిఆర్ఎస్ పార్టీకి రాజీనామాలు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని దిమా వ్యక్తం చేశారు. బిజెపి పార్టీ యువకులు రేవంత్ రెడ్డి పాలన బాగుంది అని చూసి మేము పార్టీలోకి జేన్ అవుతున్నామని తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులను గెలిపించుకునేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు గడ్డమీద మహేష్, సాయిబాబా , బట్టు అరుణ్, తాటి స్వామి, చేన్నగారి ప్రవీణ్ గౌడ్, మొగిలి రాజు, గరిగే స్వామి, కాటం స్వామి తదితరులు పాల్గొన్నారు.





# శ్రీరామ నవమి పండుగ సందర్భంగా వైన్స్ షాపులు బంద్

బోధన్ : మార్చి 26 జన సంఘర్షణ





శ్రీరామ నవమి పండుగ నేపథ్యంలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని వైన్స్ షాపులు బంద్ పోలీస్ కమిషనర్ గురువారం రోజున వెల్లడించారు. నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో గల ప్రజలందరికీ తెలియజేయునది. సెక్షన్ 20(1) తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారంగా ఏమనగా శ్రీరామనవమి పండుగ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలో గల కళ్ళు దుకాణాలు, కల్లు డిపోలు, ఐ.ఎమ్.ఎల్ (ఎ4) షాప్స్ / 2-బి బార్స్ / క్లబ్బులు / టిడి-1, సిఎస్ -2 మొదలగునవి తేదీ: 27-3-2026 ఉదయం 6 గంటల నుండి తేది : 28-3-2026 ఉదయం 6 గంటల వరకు మూసి వేయబడును.

# బీర్కూర్ తై బజార్ వేలం పాట..

మార్చ్ 26 (జన సంఘర్షణ)

431000 రూపాయలతో పోతంగల్ గ్రామానికి చెందిన గంగారాజులు వేలం పాట కైవసం చేసు కున్నారు.



# తెలంగాణ శాసన సభ భవనంలోని కమిటీ హాల్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ..

మార్చ్ 26 (జనసంఘర్షణ)

తెలంగాణ శాసన సభ భవనంలోని కమిటీ హాల్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా పోచారం మంత్రి పొన్నంతో మాట్లాడుతూ ప్రతిరోజూ వేల మంది ప్రయాణికులతో రాకపోకలు సాగించే నియోజకవర్గ కేంద్రమైన బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా తయారవడంతో వెంటనే బాన్సువాడ బస్టాండ్ మరమత్తు పనులు చేయించాలని రవాణా శాఖ మంత్రిని కోరారు. వెంటనే మంత్రి పోచారం వినతిపై సానుకూలంగా స్పందించి త్వరలోనే బస్టాండ్ మరమ్మత్తు పనులు కొనసాగేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రవాణా శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ వై.నాగి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# సేవతోనే రాజకీయ పదవులకు గుర్తింపు..



- డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు గంప ప్రసాద్‌కు సన్మానం
- కామారెడ్డి రక్తదాత సమూహం ఆధ్వర్యంల

(జన సంఘర్షణ) కామారెడ్డి ప్రతినిధి మార్చ్ 26:

కామారెడ్డి జిల్లా కేంద్రంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియామకం అయిన గంప ప్రసాద్‌ను రక్తదాతల సమూహ సభ్యులు సన్మానించి అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రక్తదాతల సమూహ ఫౌండర్ డాక్టర్ బాలు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్, అధ్యక్షుడు జమీల్ అహ్మద్ లు మాట్లాడుతూ..సేవతోనే రాజకీయ పదవులకు గుర్తింపు వస్తుందని, కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడిగా గంప ప్రసాద్ ఎన్నో రక్తదాన సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, వ్యక్తిగతంగా 25 సార్లు రక్తదానం చేయడమే కాకుండా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరాలను విజయవంతం చేయడం కోసం పనిచేయడం జరిగిందని, సామాజిక సేవ చేస్తున్న వ్యక్తులకు రాజకీయ పదవులు రావడం అభినందనీయమని దీనికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలియజేస్తాను. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎర్రం చంద్రశేఖర్, పర్స వెంకటరమణ, సలహాదారులు జాలిగామ శ్రీకాంత్ లు పాల్గొనడం జరిగింది.

# మైనర్లపై జరుగు నేరాలు ప్రేమలు మోసాలు

❑ సైబరు నేరాలు, వేసవి కాలంలో తీసుకోవలిసిన జాగ్రత్తలు వివిధ సామజిక అంశములపై అవగాహన కార్యక్రమం




బీబీపేట్. మార్చి 26 ( జన సంఘర్షణ )
కామారెడ్డి జిల్లా. బీబీపేట్ మండలంలోని తిమ్మయ్య సుశీల నారాయణ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కామారెడ్డి జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ ఎం.రాజేష్ చంద్ర ఐపీయస్ ఆదేశానుసారం బీబీపేట్ సబ్-ఇన్స్పెక్టర్ కొండ విజయ్ సూచన మేరకు పోలీస్ కళాబృందంచే అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. షి టీమ్ నం 8712686094, సైబర్ నేరాల టోల్ ఫ్రీ నం 1930 అత్యవసర సమయంలో డైల్ 100 కాల్ చేయాలని, ఇంస్టాగ్రామ్ ఫేస్ బుక్ సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని మంచి లక్ష్యంతో చదువు కోవాలని ఏచిన్న పొరపాటు చేసిన జీవితాలు నాశనం అవుతాయని, తల్లి తండ్రులు చెప్పినట్లు వినాలని పోలీస్ కళాబృందం ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్, రామంచ తిరుపతి హెడ్ కానిస్టేబుల్ యు.శేషరావు, పిసి.సాయిలు మాటలు పాటలు ద్వారా కార్యక్రమం చేయడమైనది. ఈ కార్యక్రమంలో బీబీపేట ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం, పాఠశాల హెడ్ మాస్టర్ రవీందర్ రెడ్డి, కామారెడ్డి షి టీమ్.సభ్యులు డబ్లుపిసి సౌజన్య, ఉపధ్యాయు బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బయ్యారం రైతులకు గుడ్‌న్యూస్..ఐదు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు గ్రీన్ సిగ్నల్!

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి (జన సంఘర్షణ )
బయ్యారం మండలంలోని మొక్కజొన్న రైతుల సమస్యలపై దృఢంగా పోరాడిన నాయకత్వానికి ఫలితం దక్కింది. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో, మాజీ సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క బయ్యారం మండలానికే ఐదు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మంజూరు చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని రైతులు పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు చేసినప్పటికీ, సరైన కొనుగోలు కేంద్రాలు లేక దళారుల దోపిడీకి గురవుతూ, తక్కువ ధరలకు పంటను అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. అదనంగా, దూర ప్రాంతాలకు పంటను తరలించాల్సి రావడంతో రవాణా భారంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్యలను గుర్తించిన మాజీ సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, వెంటనే ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే ఆలస్యం చేయకుండా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి వినతిపత్రం అందజేశారు. రైతుల ఇబ్బందులను వివరంగా విన్న మంత్రి సానుకూలంగా స్పందించి, బయ్యారం, ఉప్పలపాడు, రామచంద్రాపురం, కంభాలపల్లి, కస్తూరినగరం గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే వెంకటాపురం కొత్తపేటలో కూడా కేంద్రం మంజూరు అయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఈ నిర్ణయంతో మండలంలోని రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. “రైతు సమస్యలపై నిజాయితీగా పోరాడితే ఫలితం తప్పక వస్తుంది” అనే విషయాన్ని మూల మధుకర్ రెడ్డి మరోసారి నిరూపించారని కాంగ్రెస్ శ్రేణులు, రైతులు ప్రశంసిస్తున్నారు. రైతుకు గిట్టుబాటు ధర రావాలంటే మాటలు కాదు, మంత్రి స్థాయికి ఫైల్ తీసుకెళ్లే నాయకత్వం అవసరమని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.

**రేపు ప్రారంభం కానున్న కేంద్రాలు:**
మధ్యాహ్నం 3:00 గంటలకు – కస్తూరినగరం,
సాయంత్రం 4:00 గంటలకు -- రామచంద్రాపురం.
ఈ రెండు గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ రాంబాబు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు తదితరులు హాజరుకానున్నారు.

**పిలుపు:**



కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. రైతుల పోరాటానికి ఇది ఒక విజయగాథ... బయ్యారం రైతులకు ఇది నిజమైన ఊరటనిచ్చే నిర్ణయం!

# హనుమాన్ ర్యాలీని విజయవంతం చేయండి...

❑ విఎచ్‌పి పిలుపు..




నిజామాబాద్, మార్చ్26 (జన సంఘర్షణ)
ఏప్రిల్ 2వ తేదీన జరిగే హనుమాన్ ధరణి ర్యాలీని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు నగర ప్రజలను కోరారు. గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నామని ఈ శోభ యాత్రకు ప్రతి ఒక్కరు సహకరించి సహకరించాలని కోరారు. అటు అధికారులతో పాటు విశ్వహిందూ పరిషత్ సభ్యులు అందరూ కలిసి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. గత సంవత్సరం లక్ష పై చిలుక భక్తులు ఈ ర్యాలీని చూసి ఆనందించారని ఈ సంవత్సరం కూడా భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి పోలీసు వ్యవస్థ సహకరించాలని కోరారు. పోలీస్ వ్యవస్థతో పాటు మున్సిపల్ అధికారులు మీద ఉన్నతాధికారులు ప్రతి ఒక్కరు సహకరించి ఈ ర్యాలీని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. నగర ప్రజలు ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఈ విలేకరుల సమావేశంలో విశ్వహిందూ పరిషత్ హిందూ విభాగం కార్యదర్శి కృష్ణాజీ, దినేష్, ఠాగూర్ ,విహెచ్పి జిల్లా అధ్యక్షులు, హిందు వాహిని జిల్లా అధ్యక్షులు దాసరి సాయి ప్రసాద్, దాత్రిక రమేష్, శేఖర్, నికేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఊటుపల్లి గ్రామంలో కోతుల బెడద

❑ ముగ్గురికి గాయపరిచిన కోతులు..



బోధన్: మార్చి 26 జన సంఘర్షణ
బోధన్ మండలంలోని ఊట్పల్లి గ్రామంలో కోతుల బెడద ఎక్కువైంది. సర్ఫరాజ్ అనే వ్యక్తి కుమారుడుపై కోతి దాడి చేసి గాయపరిచింది. అతనిని బోధన్ ఏరియా ఆస్పటల్ తరలించి వ్యాక్సిన్ వేయించారు. గ్రామంలో అనేక మందికి గాయపరిచాయని కోతుల బెడద వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కోతులను పట్టించి అడవిలో వదిలి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

# బీబీపేట్‌లో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపిడి

బీబీపేట్, మార్చి. 2 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలో గురువారం ఏపీడి వామన్ రావు ఉపాధి హామీ పనులు అయినటువంటి చేపల కుంట, మట్టి రోడ్ల నిర్మాణం, నర్సరీ, ఆవుల షెడ్డు నిర్మాణం వంటి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు సమయపాలన పాటించాలని ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందువలన పని ప్రదేశంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్రోదయ కుమార్, బీబీపేట్ సర్పంచ్ ఎదుల సాత్విక సాయినాథ్, బీబీపేట్ మండల ఏపీఓ, మండల అధికారులు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల ధర్నా

కామారెడ్డి. మార్చ్ 26. ( జన సంఘర్షణ )




కామారెడ్డి జిల్లా, తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్టిజన్ విద్యుత్ కార్మికులకు ఏపీఎస్ఈబి సర్వీసు రూల్స్ అమలు చేయాలని డిమాండ్. అనంతరం కామారెడ్డి డివిజన్ చైర్మన్ సునీల్ గౌడ్ మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ప్రతి పక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా ఆర్టిజన్ కార్మికులను విద్యుత్ శాఖ శాశ్వత కార్మికులకు గుర్తించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు గడుస్తున్న ఇప్పటి వరకు తమ సమస్యలను పట్టించుకోవడం లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టిజన్ విద్యుత్ ఉద్యోగస్తుల సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తారని ప్రస్తుత డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ లను అమలు చేయకపోతే ఈ నెల 30, వచ్చే నెల 2 ధర్నా, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 7 వ తేదీన. ఎన్‌పిడిసిఎల్ కంపెనీ ఆఫీస్ ముందు మహా ధర్నా నిర్వహిస్తామని అన్నారు. అప్పటిలోపు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అమలు పరచకపోతే 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్మికులు సమ్మెలోని వెళ్లనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఆర్టిజన్, ఇతర విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# సృజన టెక్ పెస్ట్-2026’ లో కోటగిరి పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ


కోటగిరి, /మార్చి 26 /(జన సంఘర్షణ)




సృజన టెక్ ఫెస్ట్‌లో కోటగిరి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతి సాధించినట్లు కోటగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ తెలిపారు. ఈ మేరుకు ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన గురువారం అభినందించారు. హైదరాబాద్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 25న నిర్వహించిన విద్యార్థుల సృజనాత్మకతను వెలువరిచే రాష్ట్ర స్థాయి సృజన టెక్ ఫెస్ట్-2026 లో కోటగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు రెండవ బహుమతిని గెలుచుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఇందులో రాష్ట్రస్థాయిలో 13 కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారని, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు కూడా నాలుగవ బహుమతిని రాష్ట్రస్థాయిలో గెలుపొందారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు అభినందించారు.

# సదన్ స్వధార్ హోమ్‌ను సందర్శించిన బోధన్ సబ్ కలెక్టర్

బోధన్: మార్చి 26 జన సంఘర్షణ



బోధన్ సబ్-కలెక్టర్ శక్తి సదన్ స్వధార్ హోమ్‌ను గురువారం రోజున సందర్శించి, హోమ్ సమగ్ర నిర్వహణ మరియు పరిపాలనను సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహణ విధానాలను పరిశీలించి నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పనులు జరుగుతున్నారు. అలాగే, ఇన్‌మేట్స్‌కు అందిస్తున్న భోజన మెనూను పరిశీలించి, ఆహార నాణ్యత, పోషక విలువలను అంచనా వేశారు. అంతేకాక, నివాసితులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సంక్షేమం, నివాస పరిస్థితులు, సమస్యలను తెలుసుకున్నారు. అదేవిధంగా, హోమ్ నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించి సరైన రికార్డు నిర్వహణ , పారదర్శకత ఉన్నదో లేదో తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలను, వారి బాధ్యతలను సమీక్షించి తగిన సిబ్బంది ఉన్నారో లేదో నిర్ధారించారు. అలాగే, హోమ్ నుండి వెళ్లే ఇన్‌మేట్స్ యొక్క సంప్రదింపు వివరాలను సేకరించి, తరువాత వారితో సంప్రదించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.

# బీబీపేట్‌లో బాధిత కుటుంబాలకు షబ్బీర్ అలీ పరామర్శ

బీబీపేట్, మార్చి 26: ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా. బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాంచంద్ర రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బీబీపేట్ మండల కేంద్రానికి చెందిన డాక్టర్ నాగిరెడ్డి మరణంపై వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుంపెళ్ళ గూడెంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

◆ సర్పంచ్ విజ్ఞప్తి



ఖమ్మం సింగరేణి ప్రతినిధి. (జన సంఘర్షణ )

గుంపెళ్ళ గూడెం: గ్రామంలో శ్రీరామనవమి పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలందరూ ఐక్యంగా ముందుకు రావాలని సర్పంచ్ కృష్ణవేణి వీరబాబు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరామనవమి వంటి పుణ్యపండుగలు గ్రామంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సమానంగా పాల్గొని పండుగను విజయవంతం చేయాలని కోరారు. అలాగే రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి గ్రామ అభివృద్ధి, సామరస్యాన్ని దృష్టిలో ఉంచుకుని అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని యువత, పెద్దలు, మహిళలు అందరూ తమ వంతు సహకారం అందించి పండుగను మరింత ఉత్సాహంగా జరపాలని సూచించారు. శ్రీరామనవమి వేడుకలను భక్తి శ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలందరూ ముందుకు రావాలని, ప్రతి ఇంటి నుండి భాగస్వామ్యం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పండుగ ద్వారా గ్రామంలో సోదరభావం, ఐక్యత మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర పెట్రోల్ పంప్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల దినేష్ రెడ్డి ప్రెస్ మీట్ సమావేశం

నిజాంబాద్ సిటీ . మార్చి 26 . (జన సంఘర్షణ )




ప్రముఖ వ్యాపారవేత్త తెలంగాణ రాష్ట్ర పెట్రోల్ పంప్ డీలర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల దినేష్ రెడ్డి నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన ప్రెస్ మీట్లో మాట్లాడుతూ ప్రస్తుతం సోషల్ మీడియా మాధ్యమాలలో పెట్రోల్, డీజిల్ పై జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరాదని కోరారు. దినేష్ రెడ్డి మాట్లాడుతూ ఇది పెట్రోల్ పంప్ యజమానులు చేస్తున్న పనిగా కొందరు మాట్లాడడం బాధాకరంగా ఉందని పెట్రోల్ కంపెనీల నుండి వస్తున్న సాదక బాధకాలను నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ద్వారా ప్రజలకు తెలియజేయడం జరిగింది. ప్రజలు ఎవరు కూడా తమ రోజు వారి అవసరాల కొరకు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలన్నారు. ఫ్యూయల్ సప్లై కొరకు ఎటువంటి అపోహ పెట్టుకోవద్దని కోరారు. కొన్ని కంపెనీలు తమ స్వలాభం కోసం ఇష్టానుసారంగా పెట్రోల్ పంపు డీలర్లను సృష్టించారని పెట్రోల్ పంప్ యజమానులకు వ్యాపారం గిట్టుబాటు కాక సతమతం అవుతున్నారని తెలిపారు. ప్రజలు జాగ్రత్తతో అవసరానికి మించి పెట్రోల్ పోయించుకుంటున్నందున అత్యవసర సేవలకు ఆటకం కలుగుతుందని తెలిపారు. ప్రజలు సంయమనం పాటించి సామాజిక సృహతో బాధ్యతతో మెలగాలని పిలుపు నిచ్చారు.

# గురుకుల పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను అభినంచిన గ్రామ సర్పంచ్

రాజన్న సిరిసిల్ల జిల్లా . బోయిన్పల్లి మండలం. మార్చి 26 . (జన సంఘర్షణ )



బోయినిపల్లి మండలం దేశాయిపల్లి గ్రామం లోని ప్రాథమిక పాఠశాలలో ఇటీవల విడుదలైన గురుకుల ఎంట్రన్స్ ఫలితాలలో 4వ తరగతి చదువుతున్న కొంకటి ఆరాధ్య , బూరుగు రితిక్ ఎంపిక కాగా విషయం తెలుకుకున్న గ్రామ సర్పంచ్ నిమ్మ భాగ్యలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి పిల్లలకు నోట్ బుక్కులు, పెన్నులు ఇచ్చి అభినందించారు. ప్రయివేట్ పాఠశాలల కంటే మంచి విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను అభినంధించి శుభాకాంక్షలు తెలియజేశారు. నాణ్యమైన విద్య గవర్నమెంట్ పాఠశాలలో మాత్రమే దొరుకుతుందని, మన ఊరు పిల్లలను గవర్నమెంట్ పాఠశాలకే పంపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాఠశాల హెచ్ఎం గిరిజ మాట్లాడుతూ పిల్లలకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించిన సర్పంచ్‌కి ధన్యవాదములు తెలియచేస్తూ పిల్లలకు నాణ్యమైన విద్య అందిచడం కోసం తప్పకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, గ్రామ కార్యదర్శి సౌజన్య, అంగన్వాడీ టీచర్ మంజుల, వార్డు సభ్యుల సంక్షేమ సంఘం, రాష్ట్ర కోశాధికారి బత్తిని అనిల్ గౌడ్ ,వార్డు మెంబర్లు రాజశేఖర్ రెడ్డి, పొన్నాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడిన మామడ ఎస్సై

◆ రూ. 20 వేలు తీసుకుంటూ దొరికిపోయిన తీగల అశోక్



నిర్మల్/ మార్చ్ 26/(జన సంఘర్షణ)

నిర్మల్ జిల్లా మామడ పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ అధికారుల దాడులు నిర్వహించారు. రూ. 20 వేల లంచం తీసుకుంటూ ఎస్సై తీగల అశోక్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. రియల్ ఎస్టేట్ సంస్థకు సంబంధించి రూ. 40 వేల లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. ఈమేరకు గురువారం 20 వేలు తీసుకుంటూ దొరికిపోయారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రేపు నిజామాబాద్‌లో కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన

◆ శ్రీ రఘునాథ స్వామి (ఖిల్లా రాంమందిర్) ఆలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించనున్న కవిత దంపతులు !!

◆ అనంతరం తెలంగాణ జాగృతి కార్యాలయంలో సాయంత్రం 3 గంటలకు మీడియా సమావేశం

◆ శ్రీరామ నవమి సందర్భంగా డిచ్ పల్లి, బోధన్, ఆర్మూర్, పోచంపాడు, జగిత్యాల, కోరుట్ల రామాలయాల్లో కవిత దంపతుల తరపున పట్టు వస్త్రాలు.

నిజామాబాద్. మార్చి 26 . ( జన సంఘర్షణ )

శ్రీరామ నవమి సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేయనున్నారు. తన మెట్టినిల్లు అయిన నిజామాబాద్ వేదికగా ఆమె చేయనున్న ప్రకటనపై ఆసక్తి నెలకొంది. నిజామాబాద్ జాగృతి కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రెస్ మీట్ నిర్వహిస్తారు. అంతకు ముందు శ్రీ రఘునాథ ఆలయం (ఖిల్లా రాంమందిర్) లో జరిగే శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొంటారు. శ్రీ సీతారాముల కళ్యాణంలో తన భర్త దేవనపల్లి అనిల్ తో కలిసి కవిత పాల్గొంటారు. శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆ రాముల వారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్రంపై ఉండాలని, ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆమె ఆకాంక్షించారు.

**పలు రామాలయాల్లో పట్టు వస్త్రాల సమర్పణ**



ఏటా శ్రీరామ నవమి సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజవవర్గ పరిధిలోని రామాలయాల్లో కవిత దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించటం ఆనవాయితీ. ఈ ఏడాది రఘునాథ స్వామి ఆలయంలో కవిత దంపతులు స్వయంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. డిచ్ పల్లి, బోధన్, ఆర్మూర్ సిద్దుల గుట్ట, పోచంపాడు, జగిత్యాల్ ధరూర్ క్యాంప్, విద్యానగర్ రామాలయం, కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండలంలోని వాల్గొండ రామాలయాల్లో కవిత దంపతుల తరఫున వారి ప్రతినిధులు పట్టు వస్త్రాలు సమర్పించున్నారు. శ్రీరామ నవమి వేడుకల్లో కవితతో పాటు జాగృతి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం... మిల్స్ కాలనీ ఎస్ఐ సస్పెండ్



◆ సీపీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ...

వరంగల్/మార్చ్ 26/(జన సంఘర్షణ)

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సురేష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యం, ఇతర ఆరోపణల నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐపై వచ్చిన ఫిర్యాదులపై అధికారులు విచారణ జరిపారు. ఆరోపణలు నిజమని తేల్చారు. విచారణ నివేదికను సీపీ సన్ ప్రీత్ సింగ్‌కు సమర్పించారు. నివేదిక ఆధారంగా శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి సీపీ సన్ ప్రీత్ సింగ్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ సురేష్‌ను విధుల నుండి తప్పించారు.

# పెద్ద తడగూర్ సర్పంచ్‌కు సన్మానం

◆ మెమొంటో అందజేత





మద్నూర్/ మార్చ్26/(జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలో సర్పంచులుగా ఎన్నికైన రజక (చాకలి )సర్పంచులకు ఆత్మీయ అభినందన సత్కార సభ హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గురు గ్రామ సర్పంచ్ శాంతవ్వ ఈరన్న కు ప్రత్యేకంగా సన్మానించి సర్పంచ్ ఫోటోతో మెమొంటోని అందజేశారు. రజక చాకలి సర్పంచులుగా ఎన్నికైన వారిలో పెద్ద తడగూర్ సర్పంచ్ గా శాంతవ్వ ఈరన్న గెలుపొంది రికార్డ్ సృష్టించారు. రవీంద్ర భారతిలో బీసీ టైమ్స్ అండ్ బీసీ సమాజ్ ఆధ్వర్యంలో సన్మానం పొందిన సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమం నిర్వాహకుల అందరికీ సర్పంచ్ శాంతవ్వ, ఈరన్న ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# నాకు అమ్మా నాన్న లేరు సార్.. మీరే నాకు అమ్మా నాన్న! పాస్ చేయండి సార్..

తెలంగాణ/మార్చ్ 26/(జన సంఘర్షణ)

ఏడాదంతా టైం పాస్ చేసి.. పరీక్షల టైంలో కొందరు విద్యార్థులు నానాతంటాలు పడుతుంటారు. పాస్ చేయమని ఆన్సర్ షీట్లలో డబ్బులు పెట్టి బతిమిలాడుకునే వారిని చూశాం.. పాస్ చేయకపోతే చంపేస్తానని బెదిరించే వాళ్లను కూడా చూశాం. ఈ ఏడాది అంతకు మించి అన్నట్లు మరో ఆణిముత్యం బయటకు వచ్చింది.. పిల్లలు బాగా చదువుకుని ప్రయోజకులు అవుతారని.. తల్లిదండ్రులు గంపెడు ఆశలతో పెద్ద కాలేజీల్లో చేర్పించి, లక్షల రూపాయలు ఫీజులు కట్టి చదివిస్తుంటారు. అయితే వారి పిల్లలు మాత్రం ఫోన్లలో రీల్స్ చేయడానికి, సోషల్ మీడియాలో గంటల కొద్ది గడపడానికి ఆసక్తి చూపుతూ చేజేతులా భవిష్యత్తును నాశనం చేసుకుంటూ ఉంటారు. తీరా పరీక్షల సమయంలో అడ్డదారులు తొక్కుతుంటారు. సాధారణంగా ఇలా టైం పాస్ చేసే విద్యార్థులు ఆన్సర్ షీట్లలో తమను పాస్ చేయాలని టీచర్లను రకరకాలు వేడుకుంటూ ఉంటారు. కొందరు ఆన్సర్ షీట్లలో డబ్బులు పెట్టి పాస్ చేయమని బతావాలుకుంటే.. మరికొందరు సినిమా స్టోరీలు, పాటలు రాసి పేజీలు నింపేస్తుంటారు. అయితే తాజాగా తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు పూర్తవడంతో సమాధాన పత్రాల మూల్యాంకనం చేపట్టారు. ఈ క్రమంలో పేపర్లు దిద్దుతున్న మాస్టర్లకు ఇలాంటి మరో ఆణిముత్యం తగిలింది. ఓ విద్యార్థి ఆన్సర్ షీట్లో రాసిన సమాధానం, గీసిన బొమ్మలు చూసి ఎగ్జామినర్‌కు దిమ్మ తిరిగిపోయింది. దీంతో వెంటనే సదరు ఆన్సర్ షీట్‌ను ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అదికాస్తా వైరల్‌గా మారింది. ఇంతకీ ఏం రాశాడంటే..




# గోశాలలో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ..

◆ రౌండప్గోశాలలో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ.. గోశాల

◆ తెలంగాణ రౌండప్నిజామాబాద్

◆ గోశాలలో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

◆ గోవుల కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరం గోశాల చైర్మన్ గాండ్ల సంజయ్

మద్నూర్/మార్చ్ 26/(జన సంఘర్షణ)



మద్నూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ గోశాలలో గోవుల రక్షణ కొరకు షెడ్డు నిర్మాణానికి గోశాల చైర్మన్ గాండ్ల సంజు ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుల కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరమని షెడ్డు నిర్మాణానికి దాతలుగా ముందుకు రావాలని కోరారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, యువకులు గోవుల కోసం నిర్మించే షెడ్డు నిర్మాణానికి అందరం కలిసికట్టుగా దాతలను కలిసి షర్టు నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేద్దామని హామీ ఇవ్వడం జరిగింది. గోశాల షెడ్డు భూమి పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరస్ సాయిలు, డాక్టర్ బండి విజయ్, మాజీ సర్పంచ్ దరాస్ సురేష్, గ్రామ ఉపసర్పంచ్ వట్నాల రమేష్, మద్నూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ విజయ్, వివిధ పార్టీల నాయకులు కృష్ణ పటేల్, తెప్ప తుకారాం, తమ్మేవారు అజయ్, బోస్ ప్రకాష్, మున్నూరు కాపు సంఘం నాయకులు సాయిలు, గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు, గల్లి పెద్దలు పెద్ద సంఖ్యలో యువకులు హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

శుక్రవారం
27 మార్చి 2026

# ఎంత పని చేశావ్ ఇషికా.. ప్రియుడితో కలిసి కన్నతల్లిని నట్టింట్లోనే..



హైదరాబాద్/మార్చ్ 26/(జనసంఘర్షణ)
జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో అంజు (40) కూతురు ఇషికాతో కలిసి నివాసముంటోంది.. అయితే.. 2025 మే నుంచి తల్లి అంజు కనిపించడం లేదని.. కూతురు ఇషికా ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని.. దాదాపు సంవత్సరం అయినా.. క్లూ దొరకలేదని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ జవహర్‌నగర్‌లో ఘోరం వెలుగులోకి వచ్చింది. ప్రియుడితో కలిసి తల్లిని చంపి ఇంట్లోనే పాతిపెట్టిందో కూతురు.. ఏడాది క్రితం జరిగిన ఈ మర్డర్ కేసును బైక్ పట్టించింది.. తన ప్రేమకు అడ్డువస్తున్నారనే కారణంతో ఏడాది క్రితం తల్లి అంజును కూతురు ఇషికా.. ప్రియుడితో కలిసి చంపేసింది. ఆ తర్వాత తల్లి శవాన్ని ఏకంగా.. ఇంట్లోనే పాతిపెట్టింది. టూ వీలర్‌ను దాచి పెట్టి.. బండితో సహా తల్లి కనిపించట్లేదంటూ ఫిర్యాదు చేసింది. ఏమీ తెలియనట్టు అమాయకురాలిగా నటించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన జవహర్‌నగర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు.. అయితే.. ఏడాదిగా ఇంతవరకు కేసును తేల్చలేదు. లేటెస్ట్‌గా.. మృతురాలి వాహనాన్ని అమ్మే క్రమంలో విషయం బయటపడింది. టూ వీలర్‌ను అమ్మేందుకు రాంకోఠిలోని ఓ షాపుకు వెళ్లాడు ఇషికా ప్రియుడు.. ఆ సందర్భంగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన షాప్ ఓనర్.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎంట్రీ ఇవ్వడంతో మర్డర్ వ్యవహారం బయటపడింది. హత్యకు యువతి ప్రియుడు కూడా సహకరించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలంలో పోలీసులు, క్లూస్ టీం సహాయంతో తవ్వకాలు చేపట్టారు. ఇషికా, ప్రియుడు మౌంటీ రాజ్‌పుత్ అరెస్ట్. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో అంజు (40) కూతురు ఇషికాతో కలిసి నివాసముంటోంది.. అయితే.. 2025 మే నుంచి తల్లి అంజు కనిపించడం లేదని.. కూతురు ఇషికా ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని.. దాదాపు సంవత్సరం అయినా.. క్లూ దొరకలేదని పోలీసులు తెలిపారు. అయితే.. ఈ కేసులో కూతురే ప్రధాన నిందితురాలని పేర్కొన్నారు. ఇషికా.. మౌంటి రాజ్ పుత్ ప్రేమించుకున్నారని.. అయితే.. వారి ప్రేమకు అడ్డు చెప్పిందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నామన్నారు. ప్రియుడితో కలిసి తల్లిని హతమార్చి గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోనే పాతి పెట్టినట్లు పేర్కొన్నారు. చివరకు బైక్ ఈ కేసులో కీలకంగా మారిందని.. అంజు కూతురు ఇషికా, మౌంటి రాజ్‌పుత్ ఇద్దరినీ.. అదుపులోకి తీసుకోని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే.. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. నిందితులకు కఠిన శిక్ష విధించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కల్లు గీత కార్మికుల కుటుంబాల ఆశాజ్యోతి..కామ్రేడ్ ధర్మ భిక్షం

కోటగిరి/ మార్చి 26/ (జన సంఘర్షణ)
కోటగిరి మండలకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గీతా పని వారల సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ ధర్మ బిక్షం 15వ వర్ధంతి కోటగిరి గీత పరిశ్రమ సహకార సంఘం భవనంలో గురువారం కల్లుగీత కార్మికులు గౌడ కులస్తులు ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి విట్టల్ గౌడ్ మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల కుటుంబాల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు కామ్రేడ్ ధర్మ బిక్షం కల్లు సొసైటీలు ఏర్పాట్లు, గీత కార్మికులకు టిఎఫ్‌టి లైసెన్సులు, వృద్ధులకు వృద్ధా పెన్షన్లు, వన పెంపకానికి భూముల కోసం పోరాడిన మహనీయుడు గీత వృత్తిదారుల కోసం తెలంగాణ రాష్ట్ర గీతా పని వాళ్ళ సంఘం స్థాపించిన నాయకుడు తుది శ్వాస ఉన్నంతవరకు గీత కార్మికుల కుటుంబాల కోసమే పోరాడిన మహా నాయకుడు కామ్రేడ్ ధర్మ బిక్షం వారి ఆశయ సాధనకై కల్లుగీత కార్మికులందరూ కృషి చేయాలని వారు చూపిన పోరాట బాటలోనే నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటగిరి టిసిఎస్ అధ్యక్షులు డి.శంకర్ గౌడ్, గీత పనివార్ల సంఘం మండల నాయకులు బి.వెంకట్ గౌడ్, శ్రీధర్ గౌడ్, రాజా గౌడ్, నరేష్ గౌడ్, గీతా కార్మికులు ఏ.శ్రీనివాస్ గౌడ్, సాయి కృష్ణ గౌడ్, టి.శ్రీనివాస్ గౌడ్, ఎం.మొలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# రామగుండం పోలీస్ కమీషనరేట్

◆ **రామగుండం కమిషనరేట్‌లో సరిపడా ఇంధన నిల్వలు...అవసరానికి మించి నిల్వ చేయొద్దు : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**

పెద్దపల్లి జిల్లా. మార్చి 26 . (జన సంఘర్షణ )
రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో పెట్రోల్, డీజిల్‌కు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ స్పష్టం చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురై ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాల్లో ఫుల్ ట్యాంక్‌తో పాటు క్యాన్లు, వాటర్ టిన్‌లలో కూడా ఇంధనం నింపించుకుంటున్నారని తెలిపారు. దీంతో అనవసర రద్దీ ఏర్పడి సరఫరా వ్యవస్థకు అంతరాయం కలుగుతున్నదని పేర్కొన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నదని చెప్పారు.ఎటువంటి కొరత పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని, అలా చేయడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని, నిర్ధారించని సమాచారాన్ని




పంచుకోవడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. కమిషనరేట్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, వదంతులు వ్యాప్తి చేయడం లేదా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# నిజాంపేట్ కేంద్రంగా బస్ స్టాండ్ లేక ప్రజలకు ఇబ్బందులు

◆ **జర్నలిజం విద్యార్థి టీ.లక్ష్మణ్ గౌడ్ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం అందజేత**

హైదరాబాద్, మార్చి 26 (జన సంఘర్షణ):
బచుపల్లి పరిధిలో సరైన బస్ స్టాండ్ సౌకర్యం లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు రోడ్లపై నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం, ఎండ తీవ్రత మధ్య ప్రయాణికులు రక్షణ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా నిజాంపేట్, బచుపల్లి తెలుగు విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో బస్ షెల్టర్ల కొరత ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ, కనీస వసతులు లేకపోవడం గమనార్హం.ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, సామాజిక కార్యకర్త జర్నలిజం విద్యార్థి టీ.లక్ష్మణ్ గౌడ్ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ప్రతినిధి పత్రం అందజేశారు. నిజాంపేట్, బచుపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంతాల్లో తక్షణమే బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సౌకర్యార్థం సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# మాజీ కో ఆప్షన్ సభ్యులు అలీ బిన్ అబ్దుల్లా అనారోగ్యానికి గురైన అతనిని పరామర్శించిన భాస్కర్ రెడ్డి

బాన్సువాడ/మార్చ్ 26/(జన సంఘర్షణ)



బాన్సువాడ పట్టణ వాస్తవ్యులు, నిజామాబాద్ జిల్లా మాజీ కో ఆప్షన్ సభ్యులు అలీ బిన్ అబ్దుల్లా అనారోగ్యానికి గురై నిజామాబాద్ లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని అలిబిన్ అబ్దుల్లా ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపిన మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి. బాన్సువాడ పట్టణ నాయకులు, కౌన్సిలర్లు, పోచారం భాస్కర్ రెడ్డి వెంట ఉన్నారు. కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బస్వాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం

జుక్కల్/మార్చ్ 26/(జన సంరక్షణ)




జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంవి. రమణ సురేష్ సర్పంచ్ అధ్యక్షతన సమావేశమై పలు అభివృద్ధి పనులపై ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించనైనది. సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, గ్రావెలింగ్ వరకు, తాగునీటి, వీధి బల్బులు, ఇందిరమ్మ ఇండ్లు, తదితర వర్క్ లపై ఆమోదించి తీర్మానించడం అయినది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి భారద్వాజ్, ఉప సర్పంచ్ బి. అనిల్ కుమార్, వార్డ్ సభ్యులు రాధాబాయి, ఏ. శివాజీ పటేల్, కె. మల్లు కొండ, ఎల్. లక్ష్మీబాయి, షేక్. పర్వీన్, షేక్. నస్రిన్, ఎం. సంగ్రామ్, ఎం. రాజా బాయ్, బి. మహాదేవి, గ్రామపంచాయతీ కారోబార్ ఎం. బంగారం, వాటర్ మాన్..బి.వీరేశం, పారిశుద్ధ కార్మికుడు యశ్వంత్ పాల్గొన్నారు.

# ప్రజల కోసమే పని చేస్తా యువ సర్పంచ్ ఎస్ మహేష్..

మద్నూర్/ మార్చ్ 26/(జన సంఘర్షణ)



ప్రజలు తనపై నమ్మకంతో యువకున్ని గెలిపించుకున్నందుకు ప్రజల కోసమే పనిచేస్తానంటూ మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లారా గ్రామ సర్పంచ్ ఎస్ మహేష్ అన్నారు. గ్రామ అభివృద్ధికి కృషిచేస్తూ గ్రామంలోని మల్లన్న గుడి వద్ద నూతనంగా బోర్ వేయిస్తూ బోరు మోటర్కు పూజలు చేశారు. వేసవికాలంలో ప్రజలకు నీటి కొరత లేకుండా ఉండాలనే మంచి ఆలోచనతో బోర్ వేయించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎస్. మహేష్, ఉప సర్పంచ్ కలిసి ప్రజల కోసం ఎప్పుడూ ముందుండే నాయకులుగా ప్రజల్లో నిరూపించుకుంటున్నారు. ప్రజల మధ్యనే ఉంటా.. ప్రజల కోసమే పని చేస్తా అనే మాటలు నిజం చేస్తున్న నాయకుడు మహేష్ అంటున్నారు. గ్రామ ప్రజలు గ్రామంలో సమస్యలు వచ్చినప్పుడు ముందుండి పరిష్కారం చూపించే వ్యక్తిగా నిరూపించుకుంటున్నారు. ఇలాంటి నాయకుడు మన గ్రామానికి ఉండటం నిజంగా గర్వకారణం గా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

# ఉచిత కంటి పరీక్షలు



పొతంగల్/మార్చ్ 26/(జన సంఘర్షణ)
బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో భీర్కూర్ లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో పోతంగల్ మండలం హంగర్గా గ్రామంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో 102 మందికి పరీక్షలు చేయగా వీరిలో మోతి బిందు ఉన్న 22 మంది పేషంట్స్ నీ అపరేశాన్ కొరకు బోధన్ కి రిఫర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు అజయ్ సర్, భీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్ , హంగర్గ సర్పంచ్ ఉదయ్ భాస్కర్, హన్మాండ్లు, లయన్స్ క్లబ్ క్యాంప్ ఇంచార్జీ హన్మంతు రావ్ పటేల్, గ్రామ యువకులు దొంతుల బాలన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాచారం,హెచ్ఎమ్టిలో చలివేంద్రం ప్రారంభం

**-ప్రజల దాహార్తి తీర్చే సేవాభావం ప్రశంసనీయం: పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్ :**



వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు నాచారం–హెచ్ఎమ్టి ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి గురువారం ఘనంగా ప్రారంభించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు వసునూరి ప్రకాష్ రెడ్డి స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది.ప్రారంభించిన అనంతరం పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముం దుకొొచ్చిన ప్రకాష్ రెడ్డి సేవాభావం అభినందనీయం. చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప పని. నాచారం ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి," అని అన్నారు.ప్రజల పట్ల బాధ్యతతో, సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఆదర్శమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్,జి.కృష్ణ రెడ్డి,కాప్రా సాయి,మహేష్ యాదవ్,ఎం.శ్రీనివాస్ రెడ్డి, రమేష్,అశ్వత్థామ రెడ్డి,భువన గౌడ్,సునీల్ రెడ్డి,యూసుఫ్,కృష్ణ యాదవ్, నర్సింగ్ రావు,సుధాకర్ రెడ్డి,షరీఫుద్దీన్,ఫిరోజ్,రేవంత్, షాహిద్, పాషా,నరేష్,చి. నరేష్,రఘు,కృపాకర్, రాజేష్, శశి, బాల్రాజ్, శ్రీనివాస్ రెడ్డి,మహిళా సభ్యులు ఉమ,సునీత, సుష్మిత, మమత, విజయమ్మ, యాస్మీన్ తదితరులు పాల్గొన్నారు.

# "ప్రజలతోనే... ప్రజల కోసమే... నా పయనం కొనసాగుతుంది: పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ :**



ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజల కష్టాలు,సమస్యలు, అవసరాల పరిష్కారానికి తాను ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటానని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి బస్తీలో కనిపిస్తున్న వివిధ ఇబ్బందులు, ప్రతి ఇంటి కథగా మారిన వ్యక్తిగత కష్టాలను గమనిస్తూ, ప్రజలు కోరే ప్రభుత్వ సహాయం నుంచి అధికార కార్యాలయాల్లో పెండింగ్లో ఉన్న పనుల వరకు అన్ని రంగాల్లో తన సహకారం అందించేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు.పేదల కష్టాలు తీరడం నిజమైన పాలన లక్ష్యం. ఈ దిశగా సీఎం రేవంత్ రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహం నాకు బలాన్నిస్తోంది. నా ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు నాపై ఉంచిన నమ్మకం నాకు ఎప్పటికీ అండగా నిలుస్తోంది," అని పేర్కొన్నారు.రోజువారీగా ఎన్నో సమస్యలతో తనను ఆశ్రయిస్తున్న ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు.ప్రజల సేవే నా ధ్యేయం... నా బాధ్యత. ప్రజల కోసమే నా ప్రతి అడుగు ముందుకు పడుతుంది," అని భావోద్వేగంగా అన్నారు.

# శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన కీసర శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయ చైర్మన్ రాయిల శ్రావణ్ కుమార్ గుప్తా

**కీసర – :**



కీసర డివిజన్ వన్ మున్సిపల్ కార్యాలయం ప్రజలందరికీ, కీసర శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ చైర్మన్ రాయిల శ్రావణ్ కుమార్ గుప్తా శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా జరుపుకునే అచ్చమైన శ్రీరామనవమి పండగ శోభాయమానంతో కళకళలాడుతూ అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా ఈ పండుగ అందరికీ శుభాలను చేకూర్చాలని పండగ సందర్భంగా బంధువులు,మిత్రులు, ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో,సంతోషంగా గడపాలని ముఖ్యంగా రైతులకు సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండి ఆనందంగా ఉండాలని వారికి ఆర్థికంగా కలిసి రావాలని ఆకాంక్షించారు. లోకకళ్యాణం కోసం భగవంతుడు శ్రీరాముని రూపంలో మానవ జన్మ పొందారని, యావత్తు మానవాళికి శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయమని ఆయన తల్లిదండ్రుల పట్ల,తమ్ముళ్ల పట్ల,భార్యపట్ల చూపించిన గౌరవము అభిమానము ప్రస్తుత కుటుంబ వ్యవస్థకు ఆదర్శనీయమని అంతేకాకుండా తన రాజ్యంలోని ప్రజల పట్ల తాను చూపిన ప్రేమాభిమానాలు రాజు అంటే రాముడిలా ఉండాలనే అంతగా పరిడవల్లిందని ఆయన ఆశీస్సులు యావత్తు మానవాళికి ఎల్లవేళలా తోడుండాలని ఆయన కోరుతూ ప్రతి ఒక్కరికి శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# కూకట్ పల్లి ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు శ్రీనివాస బాబు

**కూకట్ పల్లి :**



కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలకు వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిలారు శ్రీనివాస బాబు శ్రీరామనవమి శుభాకాం క్షలను తెలియజేశారు. గురువారం ఆయన మీడి యాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరిం చుకొని నియోజకవర్గ పరిధిలో నిర్వహించే శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవాలను భక్తులు శాంతి యుత వాతావరణం లో భక్తిశ్రద్ధలతో జరుపుకో వాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించే శ్రీ సీతారా ముల కళ్యాణ మహోత్సవానికి పిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు చెరువులను అభివృద్ధి చేసేందుకు హైడ్రాధికారులు శ్రీకారం చుట్టారన్నారు.

# విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

**ఉప్పల్**

తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏఈ జేఏసీ)ఆధ్వర్యంలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిసన్, ఇన్–హౌస్ మరియు పీస్ రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కార్మికులు హబ్సిగూడ డిఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 8, 2026న నాంపల్లిలో భారీ కార్మిక సమ్మె నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు నాంపల్లి వద్ద నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలని, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిసన్ మరియు ఇన్–హౌస్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని,ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ ప్రకారం ఓఎం సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, టీజీఎస్పీడీ సీఎల్ మరియు టీజీఎస్పీడీసీఎల్ సంస్థల్లో ఇన్–హౌస్ వర్కర్లను అధికారికంగా గుర్తించి పూర్తి స్థాయి ఉద్యోగ హోదా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యుత్ సంస్థల్లో 04–12–2016 తేదీ కంటే ముందు అన్ని అర్హతలు ఉండి పనిచేస్తూ,ఇప్పటికీ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులుగా కొనసాగుతున్న వారిని ఆర్టిసన్గా గుర్తించాలి.పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం చెల్లించాలని, 2026 పీఆర్సీ (వేతన సవరణ) అమలు చేయాలని కోరారు.ఈ డిమాండ్ల సాధన కోసం ఇప్పటికే మార్చి 26 నుండి 30 వరకు డివిజన్ కార్యాలయాల వద్ద ధర్నాలు, ఏప్రిల్ 2న సర్కిల్ కార్యాలయాల వద్ద నిరసనలు, ఏప్రిల్ 4న కేటీపీఎస్ వద్ద కార్యక్రమం, ఏప్రిల్ 7న టీజీఎస్పీ డీసీఎల్ హెడ్ ఆఫీస్ వద్ద మహా ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ సర్కిల్ జేఏసీ చైర్మన్ సిహెచ్ వెంకటరెడ్డి, కన్వీనర్ బి రవి, జేఏసీ నాయకుడు కె బాబు,బి.శ్రీను, కె.శ్రీరాములు, శ్రీనివాసులు,అహ్మద్ సంతోష్,అజీమ్, నరసింహులు,సంగీత, మాదవి,శివ, బాలు,అశోక్, రాజేందర్ నాయక్,భరత్ ఎండి రఫీ,మల్లారెడ్డి, బౌరయ్య తదితరులు పాల్గొన్నారు.



# అరుదైన రక్త క్యాన్సర్లపై విజయం

**-నల్గొండ యువకుడికి మలక్పేట్ యశోద వైద్యుల పునర్జన్మ**

**మాడుగులపల్లి:**

నల్గొండ జిల్లాలోని ఒక పేద కుటుంబం చెందిన 20 ఏళ్ల యువకుడి ప్రాణాలను అరుదైన రక్త క్యాన్సర్ కబళించబోతున్న వేళ, మలక్పేట్ యశోద ఆసుపత్రి వైద్యుల వేగవంతమైన చికిత్స అతడిని మరణం పంచె ఊడ దాటించి కొత్త జీవితం ప్రసాదించింది. తీవ్రమైన జ్వరం, లోపలి రక్తస్రావం, శరీరంలో అకస్మాత్తుగా వచ్చిన బలహీనతతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన రోగి పరిస్థితిని మొదట గమనించిన వైద్యులు ఆయన ప్రాణాపాయ స్థితిని గుర్తించి క్షణం ఆలస్యం చేయకుండా అత్యవసర చర్యలు చేపట్టారు.

**అరుదైన క్యాన్సర్ నిర్ధారణ-పరిస్థితి క్షణక్షణం మార్పు**

పరీక్షల అనంతరం రోగికి తీవ్ర ప్రోమైలోసిటిక్ రక్త క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. ఈ రకమైన క్యాన్సర్లో రక్తం గడ్డకట్టే సామర్థ్యం తగ్గిపోవడం వల్ల సడన్గా ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం అధికం. రోజురోజుకు ఆరోగ్యం క్షీణిస్తున్న రోగి పరిస్థితి వైద్యులను అప్రమత్తం చేసింది. తక్షణమే క్యాన్సర్ నిపుణులు నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృందం ఏర్పాటు చేసి చికిత్స ఆరంభించారు. రోగి ప్రాణాలను నిలబెట్టాలంటే వెంటనే రక్తం, ప్లేట్లెట్లు అందించాల్సిన పరిస్థితి ఏర్పడడంతో అత్యవసర రక్త మార్పిడి చేపట్టబడింది.యువకుని శరీరం చికిత్సకు ఎలా స్పందిస్తుందో ప్రతి నిమిషం గమనిస్తూ వైద్యులు రక్త విలువలు, ఇన్ఫెక్షన్ల అవకాశాలు, శ్వాస స్థాయి వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి ఇన్ఫెక్షన్ సోకకుండా యాంటీబయోటిక్, యాంటీ ఫంగల్ మందులు నిరంతరంగా అందించారు.కొన్ని రోజులకే రోగి ఆరోగ్యం స్థిరపడటం వైద్యులకు, కుటుంబ సభ్యులకు ఊరటను ఇచ్చింది.వైద్య బృందం సమన్వయంతో సాగిన చికిత్సకు యువకుడు అద్భుతంగా స్పందిస్తూ క్రమంగా ఆరోగ్యవంతుడయ్యాడు. చివరకు వైద్యుల పర్యవేక్షణలో కొన్ని వారాల అనంతరం పూర్తిస్థాయి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు.

**సకాలంలో గుర్తింపు-ప్రాణరక్షణకు ప్రధాన కారణం**

ఈ సందర్భంగా మలక్పేట్ యశోద ఆసుపత్రి సహాయాధ్యక్షుడు శ్రీనివాస్ చిదూర మాట్లాడుతూ ఏ క్యాన్సర్ అయినా ముందుగానే గుర్తిస్తే నయం చేసే అవకాశాలు అధికం. ఈ కేసు కూడా అదే విషయాన్ని మరోసారి నిరూపించింది. జిల్లా స్థాయిలోని రోగులు కూడా అత్యున్నత వైద్యాన్ని అందుకునేలా మేము నిరంతరం కృషి చేస్తున్నాం" అని అన్నారు.

**కుటుంబంలో కన్నీటి ఆనందం-గ్రామంలో సంబరం**




తీవ్ర పరిస్థితి నుంచి బతికి బయటపడ్డ తన కుమారుడిని చూసుకుని రోగి తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకుని వైద్యుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు.మా బిడ్డను మాకు తిరిగి ఇచ్చినట్లే చేశారు" అని వారు భావోద్వేగంతో పేర్కొన్నారు.యువకుడు ఆరోగ్యంగా తిరిగి రావడంతో గ్రామంలో సంతోష వాతావరణం నెలకొంది. స్నేహితులు, బంధువులు యువకుడిని కలసి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు.

**యశోద వైద్య సేవలకు మరో గుర్తింపు**

అత్యంత ప్రమాదకరంగా భావించే ఈ రక్త క్యాన్సర్ను విజయవంతంగా చికిత్స చేయడంలో మలక్పేట్ యశోద వైద్యుల పాత్ర రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు పొందుతోంది. ఈ విజయం యశోద ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవల స్థాయిని మరోసారి రుజువు చేసినట్లే వైద్య వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# నాచారం డివిజన్లో శ్రీరామనవమి మహోత్సవాలు

**-వైభవంగా డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ పాఠశాలలో భక్తి శోభ**

**నాచారం :**

నాచారం డివిజన్ పరిధిలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ పాఠశాలలో గురువారం శ్రీరామనవమి మహోత్సవాలను యాజమాన్యం అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవపూర్వకంగా జరిపింది. పాఠశాల ప్రాంగణం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుని భక్తి తరంగాలు మిన్నంటాయి.శ్రీరామాయణ ఇతిహాసంలోని ఎన్నో అపూర్వ దృశ్యాలను ప్రతిబింబించేలా అందంగా అలంకరించిన వేదిక అందర్నీ ఆకట్టుకుంది. విద్యార్థులు రామచంద్రుడి జీవితంలో చోటుచేసుకున్న ఘట్టాలను నాటికల రూపంలో ఆవిష్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల నటన, వారి భావప్రకటన, ప్రదర్శనలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నాయి.విద్యార్థులు శ్రీరాముని చరిత్రను ప్రసంగ రూపంలో వివరిస్తూ,సత్యవాక్పాలకుడైన శ్రీరాముని విలువలను, ధర్మాన్ని, ఆదర్శాలను స్పష్టంగా వినిపించారు. హనుమాన్ చాలీసాను చిన్నారి మధురంగా ఆలపించిన సందర్భం సభలోని ప్రతి ఒక్కరినీ తాదాప్యానికి గురిచేసింది.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా మహోత్సవాలు కొనసాగాయి. చిన్నారులలో భక్తి, సంస్కృతి





విలువలను పెంపొందించే విధంగా కార్యక్రమం నిర్వహించడంపై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.ఈ వేడుకల్లో డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ కె. నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ కమలా మనోహర్ రావు, ఆపరేషన్స్ కోర్ హెడ్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సర్ణ అక్కినేని,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

**కోరుట్ల**




కోరుట్ల పట్టణంలోని అన్నమయ్య గుట్ట ప్రాంతంలో గురువారం ఉద యం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. కోరు ట్లలోని అన్నమ య్య గుట్ట ప్రాం తానికి చెందిన కల్లెం లింగవ్వ (63) అనే మహిళ జవహర్ నవోద య స్కూల్ ముందు నుండి రోడ్డు దాటే క్రమంలో కోరుట్ల వైపు నుండి వేములవాడ వైపు అతివేగంగా హీరో గ్లామర్ పై ప్రయాణిస్తున్న వ్యక్తి వృద్ధురాలిని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో ఆమె తలకు కాలుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వెంటనే కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కొరకు అక్కడి నుండి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో అట్టి మహిళ మార్గమధ్యంలో చనిపోయింది. మృతురాలి కొడుకు కల్లెం రామచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు..

# ప్రభుత్వ సబ్సిడీని కొబ్బరి రైతులు వినియోగించుకోవాలి

**-ఏకులపోతమ్మ కొబ్బరి సొసైటీ బోర్డ్**

**అశ్వరావుపేట :**

దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో మంజూరైన ఎరువులను కొబ్బరి రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కొబ్బరి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్ రెడ్డి, మాట్లాడుతూ కొబ్బరి సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం హెక్టారు 42,000 విలువచేసి ఎరువలను ఉచితంగా పంపిణీ చేస్తుందని ఈ సబ్సిడీని కొబ్బరి రైతులందరూ ఉపయోగించుకోవాలని అలాగే కొత్తగా మొక్కలు వేసే రైతులకు మొక్కకు 350 రూపాయలు చొప్పున రైతు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని, దమ్మపేట అశ్వరావుపేట మండలాలలో 1500 హెక్టార్లలో లో కొబ్బరి సాగు చేస్తున్నారని రైతులందరూ ఈ సబ్సిడీ వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, రావి రఘు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ సత్యం, గణపా రాము, కర్లపూడి బాలు, స్థానిక కొబ్బరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్లో రోడ్డు మరమ్మతులు

**-కౌన్సిలర్ సానియా ఖదీర్ చొరవతో తాత్కాలిక పరిష్కారం**

**జహీరాబాద్ :**

జహీరాబాద్ పట్టణంలోని వార్డ్ నంబర్ 2 పరిధిలో బైపాస్ రోడ్డునుంచి భారత్ నగర్కు వెళ్లే మార్గంలో, మైఫీల్ హోటల్ ఎదుట రోడ్డు దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమస్యపై స్పందించిన వార్డ్ కౌన్సిలర్ సానియా ఖదీర్ వెంటనే చర్యలు తీసుకుని మట్టి వేయించి రోడ్డును తాత్కాలికంగా సరిచేయించారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు కొంతవరకు ఉపశమనం పొందారు.అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పూర్తి స్థాయి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన యువసేన యూత్ సభ్యులు

**జగిత్యాల :**




జగిత్యాల జిల్లా కోరుట్ల మండల కేంద్రంలో పెరుగుతున్న వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గుమ్లాపూర్ గ్రామంలోని యువసేన యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం (చల్లని తాగునీటి కేంద్రం) ను గుమ్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద యూత్ సభ్యులు బుధవారం ప్రారంభించారు. ప్రజలు, గ్రామస్తులు, ప్రయాణికులు ఎండాకాలంలో డీహైడ్రేషన్కు గురికాకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో యువకులు ముందుకు వచ్చి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. గుమ్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా రోజంతా చల్లని తాగునీరు అందుబాటులో ఉంచి ప్రజలకు సేవ చేయాలని యూత్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, స్థానిక అధికారులు, గ్రామస్తులు యువసేన యూత్ సభ్యులను అభినందించారు. సామాజిక బాధ్యతతో యువత ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయం అని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు..

## ఉత్తరపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**జహీరాబాద్:**



సంగారెడ్డి జిల్లా కందిమండలం ఉత్తరపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ పరిధి లోని 7, 8 వార్డుల్లో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ నిఖిత సంగమేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిఖిత సంగమేష్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధి దిశగా మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణంఎంతోఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులోకూడాఅభివృద్ధికార్యక్రమాలుకొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 7వ వార్డు సభ్యుడు జాంగిర్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న సర్పంచ్ నిఖిత సంగమేష్కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లోక్ ఆదాలత్ పై ప్రత్యేక సమావేశం

**జహీరాబాద్**



మార్చ్ 28 న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను పునస్కరించుకొని స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో, బ్యాంకు, చిట్ ఫండ్, ఫైనాన్స్ పోలీసు అధికారులతో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. న్యాయ మూర్తులు మాట్లాడుతూ..రాజీ మార్గం ద్వారా రాజీ పడదగ్గ కేసులు వీలైనంత ఎక్కువగా పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. న్యాయవాదులు, బ్యాంకు, చిట్ ఫండ్ మరియు ఫైనాన్స్, పోలీసు అధికారులు లోక్ ఆదాలత్ పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని, లోక్ ఆదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియ జేయాలని తెలిపారు. లోక్ ఆదాలత్ ద్వారా కేసును రాజీ చేసుకోవడం ద్వారా సమ యాన్ని, డబ్బును ఆదా చేసినవారమవుతామని అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. లోక్ ఆదాలత్ పై ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న న్యాయ వాదులను గాని, పోలీసు అధికారులకు గాని, సంబం ధిత బ్యాంకు, చిట్ ఫండ్, ఫైనాన్స్ అధికారులకు గాని, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను గాని సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్ , ఏజిపి దత్తాత్రేయ రెడ్డి పబ్లిక్ ప్రాసెక్యూటర్ అరవింద్ కిరణ్ కుమార్ న్యాయవాదులు, చిట్ ఫండ్, ఫైనాన్స్, పోలీసు అధికారులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది,పారా లీగల్ వాలంటీర్ పాల్గొన్నారు.

## నేడు కోదండ రామాలయంలో రాములోరి కళ్యాణం

**జహీరాబాద్**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) గ్రామ పరిధిలోని మధునగర్ లో కొలువుదిరిన కోదండ రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిపేందుకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానికంగా ప్రసిద్ధి చెందిన కోదండ రామాలయంలో శ్రీ రామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఆలయాన్ని అందంగా అలంకరించారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుండి కూడా భక్తులు తరలిరానున్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదానం నిర్వహించనున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దైవ దర్శనం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# అజ్మత్నగర్లో కోటి రూపాయల కల్వర్టు పనులు పూర్తి

**-త్వరలో ప్రజల వినియోగానికి అందుబాటులోకి:మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా**

**ఉప్పల్ :**

చిలుకానగర్ డివిజన్ పరిధిలోని అజ్మత్నగర్ కాలనీలో ఇరిగేషన్ నాలా పై నిర్మించిన కోటి రూపాయల విలువైన కల్వర్టు పనులు పూర్తయ్యాయని మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఈ కల్వర్టును పూర్తిస్థాయిలో ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తామని ఆమె స్పష్టం చేశారు. జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పూర్తయిన కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలించిన గీతా, కల్వర్టు నుండి కిందికి దిగే సీసీ రహదారి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు ఆదేశించారు. అలాగే ప్రజలకు




ఎటువంటి ఇబ్బందులు లేకుండా, తక్షణమే రహదారిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రజలకు ప్రధాన వాహన సౌలభ్యం ఈ కల్వర్టు నిర్మాణంతో సికింద్రాబాద్ వైపు నుండి కళ్యాణ్పురి మార్గం ద్వారా చిలుకానగర్-- బోడుప్పల్ ప్రాంతాలకు వచ్చే ప్రజలకు ప్రయాణ సౌలభ్యం గణనీయంగా పెరగనుందని మాజీ కార్పొరేటర్ పేర్కొన్నారు. కాలనీ ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న ముఖ్య వసతిని అందించాలనే ఉద్దేశంతోటే ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయించామని గీతా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, బంటి గౌడ్, శ్యామ్, ఆజాద్, శ్రీనివాస్ రెడ్డి, అజ్మత్నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అతిశేష్ రాథోడ్, విశాలత ఎన్క్లేవ్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, గోపాల్రావు, హనుమంతు రావు,దామోదర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొండారెడ్డిపల్లిలో నేడు శ్రీసీతారాముల కల్యాణమహోత్సవం

**-కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు**



**నాగర్కర్నూల్:**

నాగర్కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో నేడు జరగబోయే శ్రీశ్రీశ్రీ సీతారాముల కల్యాణమహోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఆయనతో పాటు సహోదరులు ఇనుముల రవీందర్ రెడ్డి,ఎనుముల రాజవర్ధన్ రెడ్డి, అభివృద్ధి సంఘం చైర్మన్ కృష్ణా రెడ్డి కూడా పాల్గొననున్నారు. ఉత్సవాల ప్రత్యేక కార్యక్రమాలు కొండారెడ్డిపల్లి హనుమాన్ దేవాలయంలో రేపు ఉదయం 9.00 గంటలకు హోమం, మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవం,







సాయంత్రం 6.00 గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించబడనున్నాయి. భక్తులు, జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని దేవుళ్ల అనుగ్రహం పొందాలని నిర్వాహకులు సూచించారు. ప్రజలను పిలుపునిచ్చిన గ్రామ నాయకత్వం ఈ మహోత్సవానికి నాగర్కర్నూల్ జిల్లావాసులందరినీ ఆహ్వానిస్తూ కొండారెడ్డిపల్లి సర్పంచ్ మల్లెపాకుల వెంకటయ్య, ఉప సర్పంచ్ వేమ రెడ్డి, 8వ వార్డు సభ్యురాలు అనిత గణేష్, ఇతర వార్డు సభ్యులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నల్లమల ప్రాంత ప్రజలందరూ ఈ పవిత్ర కల్యాణోత్సవాల్లో పాల్గొని దేవదర్శనం చేసుకోవాలని గ్రామ నాయకులు కోరుతున్నారు.

# అతివేగం,ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు.

- **జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్**
- **డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి.**
- **పోలీస్ కళాబృందం ద్వారా ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం.**

**జగిత్యాల**

రోడ్డు ప్రమాదాలను నియంత్రించి, ప్రతి పౌరుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న " అరైవ్ అలైవ్ ఎ కంపెనింగ్ ఫర్ సేఫ్ రోడ్స్ ఇన్ తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. రోడ్డు




ప్రమాదాల్లో అధిక శాతం అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి కారణాల వల్లనే జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పోలీస్ కళాబృందం సభ్యులు పాటలు, నాటికల ద్వారా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే నిబంధనలు, అతివేగం వల్ల కలిగే ప్రమాదాలు వంటి అంశాలను ప్రభా




వవంతంగా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది యమధర్మరాజు మరియు చిత్రగుప్తుడు వేషధారణలో ప్రదర్శించిన నాటిక. ఈ నాటికలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల జీవితాలను ప్రతిబింబిస్తూ, వారి నిర్లక్ష్యం ఎలా ప్రాణాంతక పరిణామాలకు దారితీసిందో హృద్యంగా చూపించారు. యమధర్మరాజు, చిత్రగుప్తుడు పాత్రల ద్వారా ప్రతి మనిషి తన చర్యలకు తానే బాధ్యత వహించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తూ, చిన్న పొరపాటు కూడా ఎంతటి పెద్ద నష్టానికి కారణమవుతుందో సందేశాత్మకంగా తెలియజేశారు.

## శ్రీరామనవమి ప్రాధాన్యం వివరించిన జయమ్మ మాతాజీ

**జహీరాబాద్:**

శ్రీరామనవమి సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ హిందూ బంధువులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...శ్రీరామనవమి అనేది కేవలం రాముడి కళ్యాణ దినం మాత్రమే కాకుండా, ఆయన జన్మదినమని పేర్కొన్నారు. చైత్ర శుద్ధ నవమి రోజునే శ్రీరాముడు జన్మించారని తెలిపారు.




Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co